క్లుప్తంగా

ఐపీఎస్ అధికారి పూజలు



బొడ్రాయి వద్ద పూజల్లో పాల్గొన్న ఎగ్గడి భాస్కర్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

అర్వపల్లి : ఐపీఎస్ అధికారి, మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎగ్గడి భాస్కర్–మాలిని దంపతులు మంగళవారం తమ స్వగ్రామమైన జాజిరెడ్డిగూడెం మండలంలోని కోమటిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం, బొడ్రాయిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎగ్గడి యాదయ్య, సుదర్శన్, భారతమ్మ, మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, మల్లయ్య, మాండ్ర లింగయ్య, జాల యాదగిరి, అవిలయ్య, బి.రామశంకర్, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్ గ్రామంలోని శ్రీ దండు మైసమ్మ ఆలయం హుండీని మంగళవారం లెక్కించారు. భక్తుల కానుకల ద్వారా 130 రోజులకు గాను రూ.7,52,460 సమకూరినట్లు ఆలయ అధికారి కుశలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి, సీనియర్ అసిస్టెంట్ శంకర్, శ్రీనివాసరావు, సీత, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి



నాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు

నాగారం : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు అందించాలని, ముర్రుపాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, పీహెచ్ఎన్ అరుణ, సీహెచ్ఓ బిచ్చు నాయక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పాలు అమృతం

తుంగతుర్తి : అమ్మ పాలు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఖైరున్నిషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించాలని సూచించారు. ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీబాయి, శారద, ఆయాలు పుష్ప, ఏలేంద్ర, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

మెగా పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఖనిజ లవణం, కాల్షియమ్ అందజేస్తున్న జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి

పెన్‌పహాడ్ : రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి డి. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దూపహాడ్ గ్రామంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యశిబిరం ద్వారా 55 గేదెలు, 10 పశువులను పరీక్షించారు. 20కేజీల ఖనిజ లవణం, 20లీటర్ల కాల్షియమ్‌ను పాడి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనంతుల వెంకన్న, ఎర్రంశెట్టి కిరణ్‌కుమార్, జయసుధ, శ్రీకాంత్, సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు వంకాయలపాటి సుబ్బారావు, గోపాలమిత్రలు అలీ, సైదులు, నగేష్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

తుంగతుర్తి : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దక్పథం అలవర్చుకోవాలని తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంతోష్ ప్రైవేట్ ఆస్పత్రిలో సూర్యాపేట జిల్లా మాజీ గవర్నర్ కోనేరు నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకొని ప్రస్తుత గవర్నర్ రేపాల మదన్మోహన్ ఆదేశాల మేరకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి గుండగాని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఎనగందుల సంజీవ, ఎనగందుల గిరి, డాక్టర్ చారి, పులుసు వెంకటనారాయణ, ఓరుగంటి సుభాష్, గుజ్జ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న సొంతింటి కల

- ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల పనులు
- నూతనకల్ మండల వ్యాప్తంగా 280 ఇళ్లు మంజూరు
- పైలట్ ప్రాజెక్టు ద్వారా బక్కహేమ్లాతండాకు 49 ఇళ్లు



బక్కహేమ్లాతండాలో స్లాబ్ పూర్తయిన ఇల్లు



బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

నూతనకల్ : నూతనకల్ మండలంలోని పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. తొలి విడతగా మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు 280 ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పైలట్ ప్రాజెక్టుగా 49 ఇళ్లు..

ఈ పథకంలో భాగంగా, బక్కహేమ్లాతండాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 49 ఇళ్లను మంజూరు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రత్యేక చొరవతో ఈ తండావాసులకు ఈ అవకాశం లభించింది. తమ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు శరవేగంగా చేపడుతున్నారు. ఇప్పటికే 10 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తయ్యాయి, మరో 15 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. మిగిలిన ఇళ్ల పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయి.

వివిధ దశాల్లో ఆర్థికసాయం..

ప్రభుత్వం ఈ నిర్మాణ పనులకు ఉచితంగా ఇసుకను అందిస్తూ, సమభావన సంఘాల నుంచి లక్ష రూపాయల వరకు రుణం ఇస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. ఈ మొత్తాన్ని నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందిస్తారు. మొదటి విడతగా బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత రూ.1 లక్ష, రెండో విడతగా గోడల నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.1 లక్ష, మూడో విడతగా స్లాబ్ వేసిన తర్వాత రూ.2 లక్షలు, చివరి విడతగా మరుగుదొడ్డి, ప్లాస్టరింగ్, తలుపులు వంటి తుది పనులు పూర్తయిన తర్వాత చివరిగా రూ1 లక్ష అందిస్తారు. ఈ ఆర్థిక సహకారంతోపాటు ఉచిత ఇసుక లబ్ధిదారులకు ఎంతో ఊరటనిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తమ కలల ఇంటిని త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులు ఉత్సాహంగా పనుల్లో నిమగ్నమయ్యారు. సొంత ఇంటి ఆశ నెరవేరుతున్నందుకు వారంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించింది. ఇల్లు స్లాబ్‌లెవల్‌లో పూర్తయింది. మొదటి రెండు విడత బిల్లు అందించారు. సొంతింటి కల నెరవేరుతుండడం సంతోషంగా ఉంది.

– నేనావత్ లలిత, లబ్ధిదారురాలు, బక్కహేమ్లాతండా

సకాలంలో బిల్లుల చెల్లింపు



పైలట్ ప్రాజెక్టు కింద బక్కహేమ్లాతండాలో చేపట్టిన 49ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలను బట్టి సకాలంలో బిల్లులు అందిస్తున్నాం. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారు.

– సునీత, ఎంపీడీఓ, నూతనకల్

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఏకమవ్వాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న వి.కోటేశ్వరరావు

సూర్యాపేట అర్బన్ : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఏకమవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ, అరుణోదయ ప్రజాసంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు 200 సంవత్సరాలు దేశాన్ని పరిపాలించి ఈ దేశ సంపదను, వనరులను దోచుకెళ్లారని తెలిపారు. దీంతో ప్రజలు విసిగిపోయి క్విట్ ఇండియా ఉద్యమం కొనసాగించారని అన్నారు. నేడు అదే స్ఫూర్తితో విదేశీ బహుళ జాతి కంపెనీలను భారత్ నుంచి తరిమేలా మనమంతా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో విదేశీ బహుళ జాతి కంపెనీలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. బహుళ జాతి కంపెనీలకు వ్యతిరేకంగా ఈనెల 13 వరకు గ్రామగ్రామాన నిరసన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ప్రధాన కార్యదర్శి డి.రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, అరుణోదయ ఉపాధ్యక్షుడు బొల్లి వెంకన్న, సహాయ కార్యదర్శి ఎర్ర ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బహుళజాతి కంపెనీలు భారత్ నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామ్‌చరణ్, తునుష్ బాను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు శిక్ష

సూర్యాపేటటౌన్ : మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేటటౌన్ 1 పీఎస్ ఎస్ఐ ఏడుకొండలు హెచ్చరించారు. సూర్యాపేట పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టగా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ముగ్గురు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒకరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, మిగతా ఇద్దరికి రూ.1500 జరిమానా విధించినట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చలానాలు విధించడంతోపాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రతకు పాటుపడాలి



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వైద్యసిబ్బంది

పెన్‌పహాడ్ : పచ్చదనం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల వైద్యాధికారి రాజేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశాల సహకారంతో ఆసుపత్రి ఆవరణంలోని పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

సూర్యాపేట : ఇమాంపేట మాజీ సర్పంచ్ బోయిన అంజయ్య యాదవ్ ఆశయాలు సాధిస్తామని సూర్యాపేట లియాఫి అధ్యక్షుడు మట్టపల్లి గంగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్‌లో అంజయ్య యాదవ్ 18వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అంజయ్య యాదవ్ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లియాఫి రాష్ట్ర నాయకులు బైరి రామమూర్తి, గుమ్మడవెల్లి శ్యామ్ సుందర్, ఎస్కే ఖాదర్ బాబు, నిర్మల పాల్గొన్నారు.

11న తుంగతుర్తికి మంద కృష్ణమాదిగ రాక



మాట్లాడుతున్న బచ్చలకూరి వెంకటేశ్వర్లు

తుంగతుర్తి : ఈ నెల 11న తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ల పెంపు హామీని నెరవేర్చకపోవడం దారుణం అన్నారు. ఈ నెల 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయడానికి నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ రుద్రపోగు సురేష్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు గుండాల కొమరయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ గద్దం కాశీం, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మిట్టగడపల పురుషోత్తం మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్వాయి బాలయ్య మాదిగ, పాల్వాయి పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన




అర్వపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

తుంగతుర్తి : ఆల్బెండజోల్ మాత్రాలతో పిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని డాక్టర్ లింగమూర్తి అన్నారు. మంగళవారం వెంపటిలోని రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల దినోత్సవంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, పీహెచ్ఎన్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ విజయకుమార్, మౌనిక, సరిత, రమ్య, హెల్త్ అసిస్టెంట్ సోమన్న, యాదగిరి, చారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఈ నెల 11న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ యనగందుల నాగరాజు అన్నారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణపై వైద్యసిబ్బందికి, ఉపాధ్యాయులకు, ఆశలకు, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, హెచ్ఈఓ మాలోతు బిచ్చునాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న నిర్వహించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. అర్వపల్లి పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ మాత్రలు వేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్.. ప్రకృతితో అనుబంధం పెంచుతుంది



అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : కిచెన్ గార్డెన్ విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా ప్రకృతితో అనుబంధాన్ని పెంచుతుందని కేవీకే శాస్త్రవేత్తలు ఆదర్శ్, సుగంధి అన్నారు. మంగళవారం అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం, ఇంటి తోటల పెంపకం – ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాలకూర, తోట కూర, గోంగూర, టమాట, సొరకాయ విత్తనాలతోపాటు మిరప, వంకాయ, టమాట మొక్కలను విద్యార్థులకు అందజేశారు. కిచెన్ గార్డెన్ కోసం కేటాయించిన స్థలాన్ని అనేక బ్లాకులుగా విభజించి ఒక్కొక్క బ్లాకును ఒక్కో తరగతికి కేటాయించారు. ప్రతి తరగతి విద్యార్థులు తమ బ్లాక్‌లోని మొక్కల పర్యవేక్షణ, నీటి సరఫరా, సంరక్షణకు బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఉపాధ్యాయులు సోమయ్య, యూత్ అండ్ ఎకో క్లబ్ ఇన్‌చార్జ్ ఎం.లక్ష్మీనారాయణ, ఎకో క్లబ్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం, పరామర్శ



అర్వపల్లి : ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన బొల్లెద్దు నాగమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో మృతురాలి కుమారుడు రమేష్‌తో చిన్ననాడు విద్యనభ్యసించిన గ్రామ జెడ్పీహెచ్ఎస్ 2000-2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంట్ల శ్రీనివాసరెడ్డి, భూపతి కృష్ణ, బచ్చాటి ప్రవీణ్, బుర్ర నాగమ్మ పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుద్దేటి లచ్చయ్య (81) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పలువురు సీపీఎం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన తడకమల్ల రాములమ్మ క్యాన్సర్‌తో బాధపడుతూ మూడు సంవత్సరాల క్రితం మృతి చెందగా ఇటీవల ఆమె భర్త తడకమల్ల వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో వారి ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారికి మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు గోపగాని రమేష్, గోపగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



అభిషేక మహోత్సవంలో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యుల ఆధ్వర్యంలో యాగశాలలో ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు, మూల మంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 108 కలశములతో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో తిరుమంజన స్నపనం, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, సంకర్షణచార్యులు, శ్రీహరిచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు, రామానుజాచార్యులు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. మంగళవారం వంద రోజుల ప్రణాళికలో భాగంగా అమృత్ మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పుల్లారెడ్డి చెరువు వద్ద నిర్వహించిన వన మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, వసుంధర, వసీమ్, గోనె విజయ, అమృత మిత్ర ఉమెన్ ఫర్ ట్రీస్ సభ్యులతోపాటు, మహిళా సంఘాలు, విద్యార్థినులు, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జంక్షన్ అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలోని పెద్ద మసీదు వద్ద జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను నాణ్యత ప్రమాణాలతో చేయాలని అన్నారు. జంక్షన్ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు



రోడ్డుపైకి ఉన్న దుకాణాల షెడ్‌లు, బోర్డులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సూర్యాపేటటౌన్ : చిరు వ్యాపారులు రోడ్లపై అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని పట్టణ సీఐ వెంకటయ్య సూచించారు. ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, సిబ్బందితో కలిసి మంగళవారం కుడకుడ రోడ్డుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రోడ్డుపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాల బోర్డులు, ఇతర సామగ్రిని పోలీసులు తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను సీఐ హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవడం మంచిదని తెలిపారు.

స్త్రీ జీవితంలో మాతృత్వం ఒక వరం



సామూహిక సీమంతంలో పాల్గొన్న గర్భిణులు, పాల్గొన్న నిర్వాహకులు

సూర్యాపేట : మాతృత్వం స్త్రీ జీవితంలో ఒక గొప్ప వరం అని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డైమండ్ స్టార్ కేసీజీఎఫ్ రాచకొండ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్లో సుధాకర్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 'వాసవి వారి శ్రీమంతం వేడుక చూద్దాం రారండి' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, ఒక ఇంట్లో సీమంతం నిర్వహించడమే కష్టమైన పని, అలాంటిది ఒకేసారి 104 మంది గర్భిణులకు సీమంతం చేయడం అభినందనీయమన్నారు. వాసవీ క్లబ్ కమ్యూనిటీ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ఈ నెల 8న 'సారే, చీర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు గాజులు, పూలు, పండ్లు, స్వీట్లు, పసుపు–కుంకుమతో పాటు చీర, జాకెట్ ముక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈసీలు సింగరకొండ రవీందర్, తోట శ్యాంప్రసాద్, రాచర్ల కమలాకర్, క్యాబినెట్ సెక్రటరీ కృష్ణ, ట్రెజరర్ వెంపటి శబరి, జోన్ 1 చైర్మన్ చల్ల లక్ష్మయ్య, రీజియన్ చైర్మన్ మిరియాల సుధాకర్, దాచేపల్లి సంధ్య, వంగవీటి సుజాత, సీడీపీఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

నూతనకల్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మూడున్నర ఏళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలతో ఘోష్ కమిషన్ రిపోర్ట్ అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బత్తుల సాయిలుగౌడ్, చూడి లింగారెడ్డి, గాడ్డుల లింగరాజు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్, హరీష్ రావులపై తప్పుడు ప్రకటనలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. పీసీ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గోపగాని రమేష్, తడకమళ్ల రవికుమార్, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గ్యాస్ సిలిండర్లు ఇళ్ల వద్దకే తేవాలి

నాగారం : గ్యాస్ సిలిండర్లు ఇళ్ల వద్దకు తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ ఏజెన్సీల వారు గ్రామాల్లోని స్టేజీల వద్దే గ్యాస్‌లు ఇస్తుండటంతో గ్రామాల్లో ఉండే వృద్ధులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్, పక్షవాతంపై అవగాహన సదస్సు

ఆత్మకూర్(ఎస్) : క్యాన్సర్, పక్షవాతం వంటి వ్యాధుల లక్షణాలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడే గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించాలని పాలియేటివ్ కేర్ డాక్టర్ సతీష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్యాన్సర్, పక్షవాతం ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే వైద్య అధికారులను సంప్రదిస్తే, సకాలంలో సరైన చికిత్స అందించి ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ చెరుకు యాదగిరి, ఫిజియోథెరపిస్ట్ శ్వేత చంద్ర, సూపర్వైజర్లు సైదులు, మాణిక్యమ్మ, కొండ్ల శ్రీనివాస్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మండల పరిధిలోని పస్తాల గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుక్క శ్రీనివాస్, వడ్లకొండ వెంకన్న, కుమారస్వామి, అబ్బయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

నాగారం : మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన ఏకేఎల్ లాజిస్టిక్స్ ప్రైవేటు బస్సుల యజమాని బచ్చు ప్రభాకర్– సరళ దంపతులు రూ.2లక్షల వ్యయంతో గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాల పంపిణీ

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్‌లో నూతనంగా జారీ అయిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను బుధవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అమీనుద్దీన్, ఎంపీడీఓ ఎండీ హసీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కలెక్టర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.